ప్రమాదమని తెలిసినా..



బంగ్లామెట్ట వద్ద వేచి ఉన్న విశాఖ వైపు వెళ్లే ప్రయాణికులు

- హైవే పై తప్పని నిరీక్షణ
- ఎండావానల్లో ప్రయాణికుల అవస్థలు
- వేగ నియంత్రణ లేక తరచూ ప్రమాదాలు



వెంకటేశ్వరమెట్ట వద్ద వేచి ఉన్న విజయనగరం వైపు వెళ్లే ప్రయాణికులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గానికి ప్రధాన కేంద్రమైన తగరపువలసలో ప్రయాణికులకు సరియైన సదుపాయాలు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. జాతీయరహదారి నుంచి తగరపువలస కూడలికి బస్సుల రాకపోకలకు సంబంధించి కనెక్టివిటీ లేకపోవడంతో ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. దీంతో విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లేందుకు వెంకటేశ్వరమెట్ట వద్ద, విశాఖ వైపు వెళ్లేందుకు బంగ్లామెట్ట వద్ద జాతీయ రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. ఇక్కడ వీరికి కనీసం బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండైనా, వానైనా జాతీయరహదారిపై బస్సులు వచ్చేవరకు వేచి చూడాల్సిందే. సురక్షితంగా ఉండటం కోసం సర్వీస్‌రోడ్డులో వేచి ఉందామన్నా ఎక్కువ బస్సులు నేరుగా జాతీయరహదారిపై నుంచే వెళ్లిపోతుంటంతో కష్టమైనా.. ప్రమాదమని తెలిసినా ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్ట వద్ద ప్రయాణికుల కోసం సర్వీస్‌రోడ్డు, జాతీయ రహదారికి మధ్య ఉన్న రెయిలింగ్‌ను తొలగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

వేగ నియంత్రణకు స్టాపర్లు ఏవీ?

జాతీయరహదారి కావడంతో నిమిషానికి వందల సంఖ్యలో వాహనాలు నిత్యం తగరపువలసను దాటుకుంటూ వెళ్తుంటాయి. ఎక్కువ సంఖ్యలో వాహనాల కారణంగా వీటి వేగం 60 నుంచి 100 కిలోమీటర్లు దాటి ఉంటుంది. ఒక్కోసారి ప్రయాణికులు రోడ్డు దాటేటప్పుడు, పశువులు అడ్డంగా వచ్చినప్పుడు వాహనాల డ్రైవర్లు అయోమయానికి గురై అదుపు తప్పి పక్కకు దూసుకుపోయే ప్రమాదం ఉంది. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల కంటే ప్రయాణికులు ఎక్కువగా వేచి ఉండే ఈ కూడళ్లలో గతంలోనూ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అందువలన ప్రమాదాల నివారణకు గాను స్టాపర్లు ఏర్పాటుతో పాటు ప్రయాణికులకు రక్షణ జోన్‌గా సర్వీస్‌రోడ్డులో వేచి ఉండేలా ఆ ప్రాంతంలో రెయిలింగ్ తొలగించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించాలి



తగరపులసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మిస్తే ప్రయాణికులకు జాతీయ రహదారిపై వేచి ఉంటే సమస్య తప్పుతుంది. అప్పుడు బస్సులన్నీ కాంప్లెక్స్‌కు వచ్చి వెళ్తుంటాయి. ప్రమాదాలు నివారించవచ్చు.

– పెనుమాక జాన్ ఛార్లెస్, చిట్టివలస

వాహనాల వేగానికి కళ్లెం పడాలి



తగరపువలస మీదుగా వెళ్లే వాహనాలకు ప్రయాణికులు వేచి ఉండే చోట హెచ్చరికలు ఉండాలి. దీని కోసం స్టాపర్లు, బోర్డులు, ప్రయాణికులు రోడ్డు దాటడానికి సిగ్నల్స్ లేదా జీబ్రా గీతలు ఉండాలి.

– నమ్మి మాధవరావు, నమ్మివానిపేట

సర్కిల్ ఏర్పాటు చేయాలి



తగరపువలస కూడలి నుంచి జాతీయరహదారి మీదకు వెళ్లే వెంకటేశ్వరమెట్ట, బంగ్లామెట్ట కూడళ్ల వద్ద సర్కిల్ ఏర్పాటు చేయాలి. అలాగే తగరపువలస కూడలి నుంచి నేరుగా జాతీయరహదారిపై రాకపోకలకు వీలుగా తీర్చిదిద్దాలి. అప్పుడు ప్రమాదాలను నివారించవచ్చు.

– చిల్ల గణేష్‌రెడ్డి, చిల్లపేట

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం: విద్యార్థులందరూ ఇష్టపడి, శ్రద్ధగా చదువుకుంటే మంచి ఫలితాలను సాధించవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు, అధ్యాపకుల పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నారని, వారు చెప్పే పాఠాలను చక్కగా అభ్యసించడంతో పాటు వారి సూచనలు, సలహాలను పాటిస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణతలు పొందవచ్చని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, సభ్యత ఎంతో ముఖ్యమని.. అధ్యాపకులు, తమ తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో మెలగాలని, క్రమశిక్షణతో ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి, అధ్యాపకులు డి.మాధురి, వై.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, బి.సహదేవుడు, ప్రవీణ పాల్గొన్నారు.

భీమిలిలో ఈసీహెచ్‌ఎస్ సేవల ఏర్పాటుకు వినతి



జిల్లా సైనికబోర్డు అధికారి సత్యానందంకు వినతిపత్రం అందిస్తున్న కేజీ రెడ్డి

తగరపువలస: ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్‌ఎస్)కు సంబంధించిన సేవలు భీమిలి, తగరపువలసలో ఏర్పాటు చేయాలని భీమిలి మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కేజీ రెడ్డి జిల్లా సైనికబోర్డు అధికారి సత్యానందను కోరారు. శుక్రవారం ఆయన్ను కార్యాలయంలో కలిసి, వినతి పత్రం అందించారు. కేజీ రెడ్డి మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 4వేల మందికి పైగా మాజీ సైనికులు, వారి కుటుంబాలకు చెందిన వితంతువులు ఉన్నారన్నారు. వీరికి మల్కాపురం ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో వైద్యసేవలు పొందే అవకాశం ఉందనారు. అయితే, ఈ ఆస్పత్రి దూరంగా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని వీరందరికీ భీమిలి పరిధిలోని కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా వైద్యసేవలు అందించాలని కోరారు. దీనిపై సత్యానందం స్పందించి మాజీ సైనికుల వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఔషధ ప్రయోగాల్లో జంతువులకు ప్రత్యామ్నాయం అవసరం



మాట్లాడుతున్న డా. మందర్ కులకర్ణి

కొమ్మాది: మానవాళి ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక వ్యాధులకు ఔషధాలను కనుగొనడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని వ్యాస్ క్యాన్సర్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డా.మందర్ కులకర్ణి అన్నారు. గీతంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా పరిశోధించిన ఔషధాలను జంతువులపై ప్రయోగించి, ఫలితాలను చూడటానికి నైతిక అంశాలకు తోడు చట్టాలను అనుసరించాల్సి ఉందన్నారు. దీనికి అధిక సమయం పడుతోందని, ఈ కారణంగా జంతువులపై ప్రయోగాలకు ప్రత్యామ్నాయం గుర్తించడం అవసరమని పేర్కొన్నారు. కృత్రిమ మేధ, కంప్యూటర్ టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్న తరుణంలో ఔషధ పరిశోధనలో జంతువులను ఉపయోగించడం కంటే ఇతర మార్గాలు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘యూ జీనియస్ 3.0’ క్విజ్ పోటీల విజేత డీపాల్



విజేతలకు జ్ఞాపికలు బహూకరిస్తున్న సీపీ బాగ్చీ

సీతంపేట: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 8 నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు ‘యూ జీనియస్ 3.0’నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటేషన్–2024 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 116 పాఠశాలల నుంచి 435 బృందాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానం, ప్రతిభా పాటవాలు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గుర్తించవచ్చన్నారు. పోటీల్లో డిపాల్ స్కూల్ విజేతగా, విశాఖ వ్యాలీ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ రెండు జట్లు ముంబయిలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ ఫినాలే విజేతకు రూ.2 లక్షలు, మొదటి రన్నర్‌కు రూ.లక్ష, రెండో రన్నర్‌కు రూ.50 వేలు బహూకరిస్తారన్నారు. యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని మీనన్, డిప్యూటీ జోనల్ హెడ్‌లు దేవర శంకరరావు, శంకర్ హెంబ్రామ్, విశాఖ రీజనల్ హెడ్ నరసింహకుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆనందపురం సీఐ బాధ్యతల స్వీకరణ



చింతల వాసునాయుడు

తగరపువలస: ఆనందపురం సీఐగా చింతల వాసునాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ విభాగం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సీఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

524 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరంలో 524 యూనిట్ల రక్తం సేకరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖ, విజయనగరం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, కరస్పాండెంట్ రమాదేవి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు శివనాగేంద్రరెడ్డి, శిరీష, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కృష్ణకిషోర్, వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్

తగరపువలస: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటకు చెందిన దొలపల్లి వేణు, కారి ఆనందకుమార్, చుక్కా రాజేష్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి 5 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సంఘటన ఆలస్యంగా తెలిసింది. పాత గోకార్టింగ్ వెనుక బీచ్‌లో గంజాయి సేవించడం, రవాణా, విక్రయాలపై గుర్తు తెలియని వ్యక్తులు అందించిన సమాచారం మేరకు బుధవారం వీరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి సీజ్ చేశారు.

పచ్చదనంపై వేటు



నరికిపడేసిన చెట్లు

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సి ఉండగా, తమ సౌలభ్యం కోసం ఉన్నవాటినే నరికేస్తున్నారు కొందరు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ బీచ్‌రోడ్డు సమీపంలో ఓ రెస్టారెంట్ నిర్వాహకులు అలాంటి నిర్వాకమే వెలగబెట్టారు. రెస్టారెంట్‌కు అడ్డుగా ఉన్నాయనే నెపంతో ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు నరికివేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రకృతిని సంరక్షించుకోవాల్సి ఉండగా, ఉన్న చెట్లను నరికివేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. చెట్లు నరికివేయడం నేరమని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాండ్రంగిలో పొలం బడి



రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

పద్మనాభం: వరి పంటలో రైతులు కాలి బాటలు ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం సూచించారు. పాండ్రంగిలో శుక్రవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి ఏపుగా పెరుగుతుందన్నారు. ఎరువులు సులువుగా జల్లుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జి.రమ, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో వన మహోత్సవం



చిప్పాడ హైస్కూల్ వద్ద వన మహోత్సవ ర్యాలీలో అవంతి విద్యార్థులు

తగరపువలస: పర్యావరణ పరిరక్షణ కోసం కళాశాలల్లో వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం భీమిలి మండలం చిప్పాడలో ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్ మాట్లాడుతూ మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, రమేష్, కనకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం ఎన్ఎస్ఆర్ఐటీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం మొక్కలు నాటారు. ఈ నెల 1 నుంచి 15 వరకు జరుగుతున్న వనమహోత్సవంలో భాగంగా మొక్కల పెంపకం వలన కలిగే ప్రయోజనాలపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్, వ్యాసరచన, ప్యానెల్ డిస్కషన్స్, ఎకోవాక్, సెమినార్ పోటీలు నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, పీవో హరగోపాల్, పి.ఢిల్లీశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో కుంకుమార్చన



పొడుగుపాలెంలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆనందపురం మండలం పొడుగుపాలెంలో వినాయక మండపం వద్ద శుక్రవారం కుంకుమ పూజలు ఏర్పాటుచేశారు. పరిసర ప్రాంతాల మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మండపం వద్ద దీపారాధన నిర్వహించారు.

దేశం గర్వించదగ్గ ఇంజినీరు మోక్షగుండం



మాట్లాడుతున్న ఈసీఈ విభాగాధిపతి జగదీష్

తగరపువలస: భారతదేశం గర్వించదగ్గ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సంగివలస అనిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ అన్నారు. ఈ నెల 15న మోక్షగుండం జయంతి సందర్భంగా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంజినీర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ జ్ఞానం సముపార్జించుకోవడానికి తరచూ సదస్సులు, వర్క్‌షాపులలో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులకు టెక్నికల్ ఐడియా ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, హార్డ్‌వేర్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడింగ్ కాంటెస్ట్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఆనందపురం మండలంలోని రవీంద్రభారతి విద్యార్థులకు హార్డ్‌వేర్ ప్రాజెక్ట్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి బండి జగదీష్, అకడమిక్ డీన్ రాజ్యలక్ష్మి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్యాలెస్‌లో పార్వతీసుతుడు



మద్దిలో ఆకట్టుకుంటున్న వినాయకుడు

ప్యాలెస్‌లో పార్వతీసుతుడు కొలువుదీరాడు. మద్దిలో కాళ్ల కన్నయ్య వారి వీధిలో ఏర్పాటు చేసిన ఈ మండపం భక్తులను ఆకట్టుకుంటోంది. తాటి దుంగలతో సెట్ నిర్మించి, అందులో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, చెక్కమెట్లు నిర్మించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుంటున్నారు.

– పద్మనాభం

గణేశుని సన్నిధిలో నారాయణసేవ

- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహణ
- అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు



చిన్నబజారులో భీమిలి యూత్ ఆధ్వర్యంలో..



తాటితూరులో అన్నదానం ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



8వ వార్డు గొల్లల ఎండాడలో..

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాల్లో అన్నసమారాధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

- భీమిలి మండలం తాటితూరు ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తాటితూరు జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, పతివాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- ఒకటోవార్డు రాజవీధిలోనూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ అన్నదానం నిర్వహించారు.

కొమ్మాది: 8వ వార్డు గొల్లల ఎండాడలో గోపాలకృష్ణ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, స్థానిక నాయకులు నొడగల రాంబాబు, అల్లూరి పార్వతి, లొడగల రామ్మోహన్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: ఇక్కడ చిన్నబజారు ప్రాంతంలో భీమిలి యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 2వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్.ప్రభాకర్ నాయుడు, దొకర త్రినాథ్, అప్పికొండ కృష్ణ, గిడితూరి బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి దీపాంజలి



మంగమారిపేటలో గణేశుని రూపానికి దీపాలంకరణ



భువనేశ్వర్ కాలనీలో ఈశ్వరాకృతిలో..

కొమ్మాది: గణనాథునికి దీపాంజలి సమర్పిస్తున్నారు భక్తులు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 4వ వార్డు మంగమారిపేటలో వినాయకుని ఆకృతిని రంగులతో తీర్చిదిద్ది 208 దీపాలతో అలంకరించారు. భువనేశ్వర్ కాలనీలో మహాదేవుని ఆకృతిలో రూపొందించిన దీపాలంకరణ ఆకట్టుకుంది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి మూట్ కోర్ట్ పోటీలు

పీఎం పాలెం: న్యాయ విద్యార్థులకు ఆళ్వార్‌దాస్ న్యాయ విద్యాపరిషత్ కళాశాలలో ఈ నెల 14, 15 తేదీల్లో మూట్ కోర్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఎస్.రవీంద్ర తెలిపారు. కళాశాలలో 5 మూట్ కోర్టులు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులు జడ్జిల సమక్షంలో వాదప్రతివాదనలు చేస్తారని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ఐసీఎఫ్ఏఐ హైదరాబాద్, సింబయాసిస్ హైదరాబాద్, ప్రముఖ న్యాయ విద్యాసంస్థలతో పాటు తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి 22 లా విద్యార్థి బృందాలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 15 మంది విశ్రాంత జడ్జిలు హాజరవుతారని తెలియజేశారు. విద్యార్థులు తమ వాదనా పటిమను ప్రదర్శించేందుకు ఇది చక్కని వేదిక అవుతుందని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

తగరపువలస: హెచ్ఐవీపై సంగివలస, తాళ్లవలస గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడ్స్ సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, సోకిన తరువాత వివక్ష పాటించకుండా ఆదరించవలసిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం నేడు

తగరపువలస: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గత నెల 16 నుంచి 24 వరకు హెరిటేజ్ ఫెస్ట్ పేరుతో నిర్వహించిన అతిపెద్ద సాంస్కృతిక కార్నివాల్‌కు సంబంధించి నిర్వాహకులు శనివారం బహుమతులు అందించనున్నారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంవీ రోడ్డులో గల హరేకృష్ణ వైకుంఠం వద్ద జరిగే కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అక్షయపాత్ర ఫౌండేషన్, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తదితరుల చేతుల మీదుగా ఈ బహుమతులు అందించనున్నారు. చిత్రలేఖనం, భగవద్గీత శ్లోక పఠనం, పౌరాణిక వేషధారణ, గాత్ర సంగీతం తదితర పోటీలకు నగరానికి చెందిన 49 పాఠశాలల నుంచి 1980 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్న సంగతి తెలిసిందే. మిగిలిన వివరాలకు 95425 11108 నంబరులో సంప్రదించాలని అంబరీష దాస తెలిపారు.